# ౭ పైనోముద్దు కిందోముద్దు

రాజమండ్రి పెద్దస్టేషన్ ప్రాంతాన్ని ఎగ్జిబిషన్ ట్రెయిన్ వచ్చి నిలిచివుంది. ఊరంతా దాన్నిగురించినచాటింపువిని, కరపత్రాలు చిత్తగించి, రకరకాలుగా ముస్తాబులై చూడ్డానికి బయలుదేరి పోతూవున్నారు.

రామనాధరావు పెళ్ళాం రమణమ్మకూడా చువ్వలాంటి తనవొళ్ళు మళ్ళీమళ్ళీ అద్దంలో చూచుకుంటూ "ఏమండీ! ఇంతకంటే కొంచెం వొళ్ళుండాలంటారా నాకు?" అని అడిగింది.

రామనాధరావు "ఎందుకేవొళ్ళు వూరికే! ఆడదాని ఒంటినిగురించి ఏమన్నాడోతెలుసునా జగద్గురుశంకరాచార్యులువారు "ఏతన్మాంస వసాది వికారం" అన్నాడు. నీకిప్పుడున్న ఈమాత్రంచాలు. మిక్కిలీబాగు న్నావు." అంటూ ఆమెయొక్క దువ్వుకువేసికొన్న సిగవెండ్రుకలేవ దీస్తూ చూస్తూవున్నాడు.

రమణమ్మ "ఉందురూ! అస్తమానం! పువ్వులెట్టుకోనివ్వకుండా ఏమిటది?" అంది

"ప్యారీకచభరబంభరకేశం" అన్నాడు నవ్వుతూ రామనాధరావు. రమణమ్మ పువ్వులు తనసిగకుచుట్టుకుంటూ "నేను సన్నంగావున్నా నాతలకట్టుపెద్దది సుమండీ! మరెవ్వరూ ఈయీడున ఇంతజుత్తున్నవారు లేనేలేరు" అంది.

"అందుకే నిన్ను నేను ప్రేమిస్తూన్నాను. నడువు" అన్నాడు.

"ఏం పట్టుకొస్తున్నారు సొమ్ము ?" అని అడిగింది. "బేడ పట్టుకొస్తున్నాను" అన్నాడు రామనాధరావు. "బేడపెట్టి ఎగ్జిబిషన్‌లో ఏం కొందామని ఏమిటి మీ వూహ ?" అని అడిగింది. "ఏమివస్తే అదే కొనుక్కొందాం. అంతే ఎస్టిమేట్ : నడువు" అన్నాడు.

రమణమ్మ మరి తరికిస్తే అసలు ఎగ్జిబిషన్ చూడ్డమే పడదేమో అని ఎక్కడికక్కడికే వొప్పుకుని — "బేడకు వో బ్రూచ్ అన్నా రాక పోతుందా ?" అని ఉవ్విళ్ళూరుతూ నడిచింది. ముందు ఆమె, వెనకాల రామనాధరావు.

దారిపొడుగునా జనంలో చూస్తే, రామనాధరావు రమణమ్మల్లాగు, బేడా అణా జేబులో వేసుకుని, కొందఱిదీ వేసుకోకుండా ఎగ్జిబిషన్ ఫైరును చూడ్డానికి "లారీధూళీ మార్గావేశం"గా వెళ్ళేవాళ్ళు లక్షోపలక్షలు.

అసలు డబ్బులేని దేశం ఆంధ్రదేశం. మరిన్నీ ఎగ్జిహిబిషన్ ఫైరులో కొనడంఅంటే అన్నివస్తువులూ బహూ ప్రియం. ఇంతకూ ఎగ్జిబిషన్‌ఫైరు అంటే చూడ్డానికేగాని కొనడానికాఏమిటి అని కొందఱి సిద్ధాంతంకూడాను ఇక కొందఱిసిద్ధాంతం మనం ఫైరుకు ఎగ్జిబిషన్ గాబోతున్నాం గాబట్టి అదే ఎదురు మనకియ్యాలి" అని—ఇలా నడవగా నడవగా 6½ గంటలకు సాయంకాలం లైట్లువేసే టైముకు ఫైరుదగ్గరకు చేరుకున్నారు రామనాధరావూ రమణమ్మానూ.

ఎక్కేగుమ్మం దిగేగుమ్మంగా చూసిపారేశారు అన్ని "స్టాల్సు"న్నూ రామనాధరావు ఏమైనా కొందాం అని జేబులోంచి బేడతీస్తూవుంటాడు.

తుదకేమీ కొనలేక పోతూవుంటాడు. అతగాడు పైకితీసినంత సేపూ రమణమ్మ ఆబేడకేసి చేటంత ముఖంచేసుకు చూసేది. మళ్ళీఅతగాడు జేబులోపెట్టేసుకోవడంతోనే చింతాకంతముఖం చేసుకున్నది.

మనిషికేకాదు డబ్బుకేకాదు ఖర్చుపడాలీఅంటే తగిన అవకాశం రావాలి. అదేకాలపరిపక్వం. అదేకర్మ పరిపక్వం! చూశేశీవి అన్నీ చూసినామా లేదా అని రివ్యూచేసికొంటూ ఒకటిచూళ్ళేదనుకున్నారు ఇద్దరూను.

ఆస్టాల్ దగ్గరకెళ్ళారు రామనాథరావు రమణమ్మ!

"ఏముంటుంది లోపల"! అని అడిగారు. "వెళ్ళి చూడండి! వెళ్ళేముందు ఇద్దరూ చెరోఅణా యిక్కడ ముందు ఇచ్చి మరీవెళ్ళండి" అన్నాడు ద్వారపాలకుడు.

"లోపలవస్తువులు చూపెట్టకుండానే డబ్బుతీసుకుంటారా! ఇదెక్కడి విడ్డూరపు అమ్మకం" అంది రమణమ్మ.

"ఉండవే! నీకోఅణా నాకో అణాకు సరిపోయే సరుకు లోపల వున్నప్పుడు మనం మారుమాట చెప్పకుండా లోపలకు చొరబడిపోవడమే మంచిది, నడువు"అని రమణమ్మను ముందుకు గెంటుతూ తాను "ఇదిగో నండీ ఇద్దరికీ చెరో అణా బేడ"అన్నాడు రామనాథరావు ద్వారపాలకునితో.

వాడు ఆసేవకుడు "ఉండండి, ఈస్టాల్‌లోకి ఆడవాళ్ళ కాడవాళ్ళుగాను, మగవాళ్ళకు మగవాళ్ళుగాను వెళ్ళవలసివుంటుంది. ఒక్కొక్కళ్ళుగా. అదీరివాజు. మీరిద్దరూ ఒక్కసారి వెళ్ళకూడదు" అన్నాడు.

"మే మిద్దరం మొగుడూ పెళ్ళాలమయ్యా?" అంటూ రామనాథ రావు తనభార్యతో లోపలకు వెళ్ళాడు మెట్లు ఎక్కుతుంటూ. స్టాల్ అతి నీటుగా అతినిర్మానుష్యంగా వుంది. చుట్టూఅద్దాలున్నాయి. మరిఅమ్మే వాడూ లేడు. కొనేవాడూలేడు. సరకులూలేవు ఏవీలేవు. రకరకాలనిలువు టద్దాలుమాత్రం చుట్టూ అమరించి వున్నాయి. గేటుకీపరు తెరేశాడు గేటుకు అడ్డుగా.

"ఇక్కడేం సరుకండీ కొనుక్కునేది?" అంది రమణమ్మ. "ఏమీ లేకపోతే పూరికే లోపలకు వెళ్ళమంటారా మనయిద్దర్నీ ! రా ! యిలా ! రా ! మళ్ళీ ఆలస్యమౌతూవుంది అంటాడేమో గేటుకీపరు ? చూడు! ఈ! అద్దంలో నే నెలావున్నానో!" అన్నాడు రామనాథరావు. "మీరు పొట్టిగా మరుగుజ్జువానిలా గున్నారు. నేనూ అల్లాగే వున్నానండో! ఎక్కడలేని లావూ వచ్చిందినాకు ! కాని పొట్టిగావున్నాను. అబ్బే ! ఏమీ బాగులేదు" — అప్పటికప్పుడే రామనాథరావు మరో అద్దంలో చూసుకొంటూ వున్నాడు. "అక్కడెలావుందండీ ?" అంది రమణమ్మ.

"చూడు ! ఎంత పొడుగయ్యానో, ఇందులో నేను !" "నేనూను! వహ్వా ఏమందం ! మీది కొంగమెడా ! మడకాళ్ళూ !" "నన్నెక్కిరించక్కర్లేదు. నీవూ అలాగే వున్నావు" ఇతిసంభాషణానంతరం ఇద్దరూ మరో అద్దందగ్గఱకెళ్ళారు. అందులో ఓవైపులావుగావుండి ఓవైపు సన్నంగావున్న రూపం ఒకేమనిషిలో కనిపించింది.

"ఏమిటండీ ! ఈవికృతాకారాలకోసమా నన్నిక్కడకు తీసుకొచ్చింది ?" అని పమిటసర్దుకోసాగింది.

"నిన్ను నేను తీసుకొచ్చానా ? నన్ను నీవు తీసుకొచ్చావా ? కాని చూడు ఆకీలకం ! ఇలారా ! నీసన్నందగ్గర నాలావుమోవు. అర్ధనారీశ్వరంగా తయారవుతాం !" అన్నాడు రామనాధరావు తత్తదుచితాభినయంతో.

"కాలాతీతం కాకూడదుక మోసు. కావులించుకోకండీ ! రాండి ! ఇలారాండి ! ఈఅద్దంలో మరీచిత్రంగావుంది. చూడండి ! రెండు ముఖాలు —— పేకబొమ్మముఖాల్లాగు !" అంది రమణమ్మ. "ఏవీ !" అన్నాడు రామనాధరావు ఆఅద్దంవద్దకు పోతూ.

"అదిగో పైనోముఖం కిందోముఖం !" అంది రమణమ్మ. "మరే నేవ్ ! పైనోముద్దు కిందోముద్దు !" అని రమణమ్మ ముఖం ముద్దుపెట్టుకున్నాడు రామనాధరావు.

అవలనుండి ప్రేక్షకాతురులు, "రాండయ్యా ! మేం చూడాలి !"

రమణమ్మ బుగ్గతుడుచుకు ఇవతలకు భర్తతో వస్తూంటే ఈవల నుండి లోపలకు పోవాలని వేచుకునియున్న అమ్మలక్కలు రమణమ్మను కొందరెరిగియుండబోలు —— "ఏం కొనుక్కొన్నారమ్మా లోవల ?" అని అడిగారు. రమణమ్మ వారితో ఏమని జవాబుచెబుతుంది? "అణానరకు నేను అణానరకు మా ఆయనా" అని ముసిముసినవ్వుతో చెప్పి చనువైన ఆవిణ్ణి దూరంగా తీసికెళ్ళి చెవిలో ""పైనోముద్దు కిందోముద్దు" అంది.! "దానికోసం చెరో అణా ఖర్చుపెట్టుకోవడంకూడా ఎందుకు ?" అంది ఆయిల్లాలు.

గిరుక్కున అందరూ వెనక్కుమళ్ళేరు. వాళ్ళెవళ్ళూ అప్పార్ లోకి వెళ్ళలేదు.

ఇక రామనాధరావు పెళ్ళాంతో "వాళ్ళకేం తెలుసు మన అద్వైత విధానం. అణాఅణా బేడ పోతేపోగాక! బహాటలేగా ముద్దుపెట్టుకున్నాం! ఒక్కముద్దు రెండు ముద్దులుగా చూశాం!" అన్నాడు. రమణమ్మ ఆంది.

"మనస విచింతయ వారంవారం"

---

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| --- | --- | --- |
| 13—2—1938 | రాజమండ్రి | "వినోదిని"లో |